# ఓ బంగారు బాల్యమా ఒక్కసారి తిరిగిరా

గౌతమి రాజమండ్రి రైల్వే స్టేషనులో అప్పుడే ఆగింది.

ఆదిత్య ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులోకి యెక్కాడు. ఓ పోలీసు ఆదిత్య సూట్‌కేసుని బెర్త్ మీద ఉంచి క్రిందికి దిగి నిలుచున్నాడు. ఆదిత్య తన బెర్త్ మీద కూర్చుంటూ ఎదురు బెర్త్ మీద కూర్చున్న వ్యక్తిని పరిశీలనగా చూడసాగాడు. ఖాదీ బట్టలూ కళ్లజోడులో ఆయన చదివే పేపరు పక్కన పడేసి కళ్లజోడులోంచి ఆదిత్యాని చూస్తూ ఆవులిస్తూ అంతలోనే అనుకున్నాడు.

"ఈ ముఖం పరిచయమైనదిలా వుంది"

సరీగ్గా అప్పుడే ఆదిత్యా ఆయన ముఖంలోకి చూశాడు యధాలాపంగా.

"ఆ...ది..త్యా.." కళ్ళజోడు ఆయన చప్పున లేచాడు.

తన పేరు ఆయన నోటినించి విని పరీక్షగా చూస్తూ

"అరెః దీక్షతులూ.... నువ్వేనా.'

దీక్షితులు అమాంతం వాటేసుకున్నాడు.

"యెన్ని సంవత్సరాలైందిరా మనం చూసుకుని!" ఆదిత్య గొంతులోని ఆత్మీయతకి దీక్షితులు కళ్లలో ఆనందభాష్పాలు జాలువారాయి.

"దాదాపు పది సంవత్సరాలు గడిచాయి మనం కల్సుకుని కదూ"

"అవును. అయినా గుర్తించగలిగావంటే మన గాఢమైన స్నేహానికి చేయెత్తి జైకొడదాంరా దీక్షితులూ"

ఆదిత్య తన చేతిలోని స్నేహితుడి చేతిని తీసుకొని నొక్కుతూ అన్నాడు.

"అవును మన బాల్య స్నేహం తల్చుకుంటే మనరసు రెక్కలు కట్టుకుని నాగులాపురం పల్లెకి పరుగు తీస్తుంది కదే" దీక్షితులు అన్నాడు.

"ఔను. మరి బంగారు బాల్యం. ఆ రోజులు తల్చుకుంటే నిన్ననో మొన్ననో జరిగిపోయినట్లుగా అన్పిస్తూ వుంటుంది నాకు. జీవితంలో అతిమధురమైన స్మృతులని మిగిల్చింది నాగులాపురం లైఫ్.

ఆదిత్య కళ్లు మూసుకొని అన్నాడు.

"నాకూ అంతే ఆదిత్యా! అవును నువ్వు పోలీస్ సబ్ యిన్‌స్పెక్టర్‌వి అయ్యావని ఈ మధ్యనే తెల్సింది. యూనిఫారంలో నిన్ను చూడాలని చాలా అనుకున్నాను. రాజమండ్రి రావటానికే వీలుకాలేదనుకో"

"పోనివ్వు. నేను హైదరాబాదునించి నాలుగు రోజుల్లో తిరిగి వచ్చేస్తాను. నువ్వు తప్పకుండా రా. ఏం వస్తావు కదూ!"

యీ యిద్దరూ యిలా కబుర్లు చెప్పుకుంటూండగానే రైలు కదిలింది.

పోలీస్ ఆదిత్యకి శాల్యూట్‌చేసి వెళ్లిపోయాడు.

రైలు మెల్ల మెల్లగా వేగాన్ని పుంజుకుంది.

"ఔను నువ్వు యీ ఖద్దరు బట్టలూ వగైరా చూస్తుంటే యంఎల్యేని అయ్యావా కాబోతున్నావా!"

దీక్షితులు పకపకా నవ్వాడు.

"రెండూ కాదు. ఖాదీ షాపు పెట్టాను."

మంచి పనిచేసావు. యింతకీ నీ పెళ్లి అయిందా?"

ఓ అయింది. నా శ్రీమతి యెవరో తెల్సునా! మీనాక్షి మన బాల్య స్నేహితురాలు"

అదిరిపడ్డాడు ఆదిత్య.

"మీ యిద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం వుండేది. పెళ్లి యెలా సాధ్యమైంది" కుతూహలంగా అడిగాడు ఆదిత్య.

"అదే చిత్రం. మీనాక్షి మేనత్త శ్రీమంతురాలు. కానీ పిల్లలు లేరు. మీనాక్షిని పెంచుకుని నాకిచ్చి పెళ్లిచేసింది. లక్ష కట్నంతో."

"నిజంగా?"

"నిజం ఆదిత్యా! డబ్బు లేనప్పుడు మీనాక్షి దయ్యంలా కన్పించినా డబ్బు వాసన తగిలేసరికి నామెదడు పనిచేయలేదు. అంతే ఆలోచించకుండా మూడు ముళ్ళూ వేసేసాను. చిన్నప్పటి శతృత్వానికి పుల్‌స్టాప్ పెడదామని అనుకున్నాను. కానీ మీనాక్షి అలా అనుకోలేదు" దీర్ఘంగా నిట్టూర్చాడు దీక్షితులు.

"అంటే మీ దాంపత్యం?"

"వుద్దాలక మహర్షి ఫామిలీ లాంటిదే నాది. అయితేనేం ఇద్దరు పిల్లలు పుట్టేశారు. వాళ్ళూ ఆడపిల్లలు. అమ్మలా రాక్షసులు."

"నిజమే చెప్తున్నావా! జోక్ చేస్తున్నావా! జాలిగా మిత్రుడిని చూస్తూ అన్నాడు ఆదిత్య.

"నిజంరా! నా ముఖంలో తెలియడం లేదూ!

"వూ ! సరేగాని ఆనందమోహన్ పెళ్ళి అయిందటగా"

"వూ! నా దాంపత్యం చూసి వాడు భయపడి ఓమూగపిల్లని పెళ్ళి చేసుకున్నాడు'

"దీక్షితులూ కథలు చెప్పకు" ఆదిత్య ముఖం గంభీరంగా పెట్టాడు.

"ఆదిత్యా నేను చిన్నప్పుడు అబద్ధాలు చెప్పేవాడిని. కానీ మీనాక్షిని పెళ్ళాడిన దగ్గర్నుంచీ అబద్దాలు చెప్పటం మానేశానురా"

"పాపం అలాగా! యెందుకనీ?"

"నే అబద్ధం ఆడానని తెలిసిందా మీనాక్షి నూతిలో దూకేస్తానని బెదిరిస్తుంది. అందువల్ల చెప్పే అలవాటు పోయింది" దీక్షితులు చెప్తుంటే ఆదిత్యకి నవ్వాగలేదు.

"సరే! నమ్ముతున్నాను. నేను త్వరలోనే వచ్చి మీ దాంపత్యాన్ని చూస్తాను. ఆ తర్వాత చెప్పు. ఆనందమోహన్ హాయిగా వున్నాడా!"

"లేదు"

"ఎందుకనీ"

"నోరులేని డబ్బున్న అందమైన అమ్మాయి అని పెళ్ళాడేసి ఆమెని ప్రేమగా చూసుకున్నట్లే నటిస్తూ 'చిన్నిల్లు'ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ విషయం ఈ మధ్యనే ఆనందమోహన్ భార్యకి తెల్సిందట"

"తర్వాత?"

"ఆనందమోహన్‌ని కట్టుబట్టలతో ఇంటి నుంచి తరిమేసిందట. వాడు ఈ మధ్య ఈ విషయాలు వుత్తరం రాస్తూ ఓ వెయ్యి రూపాయలు పంపమనీ ఓ వుద్యోగం ఏదన్నా చూడగలవా అనీ రాశాడు"

ఆదిత్య ఆశ్చర్యంగా చూస్తూ-

"మూగపిల్ల అయినా ధైర్యంగా వాడికి బుద్ధి చెప్పినందుకు అభినందించాలి."

"ఆదిత్యా చదువుకున్న ఆడపిల్లలు పరమ డేంజరుగా తయారయ్యార్రా"

"ఈ విషయం నేను ఒప్పుకోను కానీ శర్మ యెక్కడున్నాడు?"

"వాడు నాగులాపురంలోనే ఓ ఫ్యాన్సీ షాపు పెట్టుకుని భ్రమరాంబని పెళ్లాడేసాడు"

"ఆ కోతిలాంటి పిల్లని శర్మ చేసుకున్నాడా"

"వూ ! నేను ఈ మాటే అడిగాను. వాడు యేమన్నాడో తెల్సునా నాకు స్వీట్లంటే యిష్టం. స్వీట్లు భ్రమరాంభ బాగా చేస్తుంది అన్నాడు".

"అంటే శర్మ రోజూ అన్నం మాని స్వీట్లు తిని బ్రతుకున్నాడటనా"

వస్తున్న నవ్వుని ఆపుకుంటూ అడిగాడు ఆదిత్య.

"నేను నీలానే అడిగాను. వాడు ఏడుపు ముఖం పెట్టి నాకు డయాబిటీస్ రా" అన్నాడు.

"అయ్యో అలాగా" జాలిపడిపోయాడు ఆదిత్య.

"అదేరా జీవితం అంటే అనుకున్నవి జరగవు. జరిగేవి అనుకోం. అవన్నీ సరేగాని నీ పెళ్లి యెప్పుడు?"

"నచ్చిన అమ్మాయి దొరకలేదు. యిప్పటివరకూ అదీగాక నువ్వు చెప్పిన కబుర్లు విన్నతర్వాత నాకు పెళ్లి అంటే భయం పట్టుకుంది." నవ్వుతూ అన్నాడు ఆదిత్య.

"అలా అనకు. అందరికీ ఒక్కలా యెలా జరుగుతుంది. అయినా నువ్వు పోలీస్ ఆఫీసర్‌వి ఎలాంటి పిల్ల వచ్చినా కంట్రోల్ చేసుకోగలవు.

"ఏమో! ఏం జరుగుతుందో! ఔనూ మన కల్పన ఏం చేస్తోంది. పెళ్లి అయిందా?"

"పెళ్లి విషయంనాకు తెలియదు గాని డాక్టర్ అయిందని విన్నాను"

"నిజమా! కల్పన డాక్టర్ అయిందా! ఎక్కడ వుంది?"

"తెలియదు! కానీ యెవరో అన్నారు. హైదరాబాద్‌లోనే వుందని"

"హైదరాబాద్‌లో యెక్కడరా" ఆతృతగా అడిగాడూ ఆదిత్య.

"నాకు తెలియదు అన్నానా" ఆదిత్య గొంతులోని ఆతృత గమనించి కళ్లెగరేస్తూ అన్నాడు దీక్షితులు.

"ఆదిత్యా చిన్నప్పుడు కల్పనా నువ్వూచాలా ఫ్రెండ్లీగా వుండేవాళ్లు కదా! మరి మీ మధ్య వుత్తరాలు వగైరా ఏం లేవా?"

"లేవు. నేనా వూరు వదలిన తర్వాత కల్పనని మళ్లా చూడలేదు. ఆ నాటి స్నేహం నాకు గుర్తు వుంది కానీ కల్పనకి గుర్తు వుండి వుండద్దూ"

దీక్షితులు నవ్వాడు.

"ఓరే పోలీసాఫీసరూ! బాల్య స్నేహితులని యెక్కువగా గుర్తుంచుకునేది ఆడపిల్లలే అని నా భార్యామణి యెప్పుడూ చెప్తూ వుంటుంది."

"ఔనేమో నాకు తెలియదు"

"నువ్వు హైదరాబాదేగా వెళుతున్నావ్! కల్పనని వెతుకు."

అంటూ చాలాసేపే కబుర్లు చెప్పి ఏలూరులో దిగిపోయాడు దీక్షితులు, ఆదిత్యని వదలలేక వదులుతూ.

ఆదిత్యకీ దీక్షితులని వదలటానికి బాధగానే వుంది. అయినా తప్పదు.

రైలు మళ్లా ప్రయాణం ప్రారంభించింది.

ఆదిత్యకి నిద్ర రావటం లేదు. మనసు బాల్యంలోకి పరుగుతీసింది.

## –2–

ఆదిత్య తండ్రి హోమియోపతీ డాక్టరు. స్వంతవూరిలో ప్రాక్టీసు లేక నాగులాపురం చుట్టుపట్ల అయిదారు కిలోమీటర్లు దూరంలో డాక్టర్ అన్నవాడు యెవరూ లేరని తెల్సి నాగులాపురం కాపురం మార్చాడు ఆయన. అప్పటికి ఆదిత్యకి పదమూడేళ్ళు. నాగులాపురానికి కిలోమీటరు దూరంలోగానీ హైస్కూలు లేదు. అక్కడికే వెళ్లి చదువుకుని వచ్చేవారు ఆ వూళ్లోని కొందరు పిల్లలు. అక్కడే దీక్షితులు, శర్మా, ఆనందమోహన్ పరిచయం అయ్యారు.

స్కూల్‌కి క్యారియర్‌లో భోజనం పట్టుకుని పుస్తకాల సంచీలు వీపుమీద వేసుకుని పంట చేలకి అడ్డం పడి చిన్న చిన్న నీటిబోదెలని దాటుకుంటూ కూనిరాగాలు తీస్తూ కబుర్లు చెప్పుకుంటూ నడవటం చాలా సరదాగా వుండేది. అంత దూరం నడక శ్రమ అన్పించకపోయేది. అలా మొదటి సంవత్సరం గడిచింది. అందరూ తొమ్మిదో తరగతిలోకి వచ్చారు. రెండో సంవత్సరంలో స్కూలు తెరచిన మూడో రోజునించీ తమ వెనుకగా నడచివస్తున్న ముగ్గురు అమ్మాయిలు కన్పించారు. తమలానే పుస్తకాలు, టిఫిను బాక్సులూ.

"ఎవరా అమ్మాయి" ఆదిత్య అడిగాడు.

"కల్పన కరణంగారి అమ్మాయి. మీనాక్షి సుందరంగారి అమ్మాయి. భ్రమరాంబ పోస్ట్‌మాష్టర్‌గారి అమ్మాయి."

"కల్పనంటే కాస్త బొద్దుగా పొట్టి జడా చక్రాలలోలకులు లాకెట్ గొలుసూ వున్న అమ్మాయేనా"

"ఊఁ ! మహా పొగరు. కదిలిస్తే కరుస్తుంది" శర్మ గొంతు తగ్గించి అన్నాడు.

"ఊఁ అలాగా! అయినా వీళ్లు ప్రతిరోజూ వానలో ఎండలో మనలా అంతదూరం నడిచి రాగలరా" ఆనందమోహన్ సాలోచనగా చూస్తూ అన్నాడు.

ఆ అమ్మాయిలు అబ్బాయిల వెనుక నిశ్శబ్దంగా నడిచి వస్తూ పోతూ వున్నా స్కూలో ఆటల్లో చాలా హుషారుగా కన్పిస్తూండేవారు.

అబ్బాయిలకి ఈ ఆడపిల్లలని చూస్తే జాలిముంచుకు వచ్చి పరిచయం చేసుకున్నారు. అంతే భ్రమరాంబ, మీనాక్షి కబుర్లు దంచేసేవాళ్లు కల్పన మాత్రం చాలా తక్కువగా మాట్లాడేది. వారి మధ్య ఎన్నెన్నో కబుర్లు దొర్లిపోయేవి.

పదమూడేళ్ళ వయసులోనే కల్పన అందంగా కన్పిస్తూ వుండేది. మిగతా అమ్మాయిలు లంగా ఓణీలు వేసుకునేవారు. కానీ లంగా దానిమీద పొడుగ్గా వుండే బుట్ట చేతుల జాకెట్టు వేసుకునేది. చేలగట్ల మీద నించి వరసగా నడుస్తూ యెన్నెన్నో కబుర్లు చెప్పుకునేవాళ్లు,

ఒక రోజు పెళ్లి మీద అభిప్రాయాలు సేకరించాడు దీక్షితులు.

అనాకారిగా కన్పించే భ్రమరాంబ అందమైన భర్త కావాలంది.

మీనాక్షి అమెరికా మొగుడే కావాలంది.

ఆదిత్య వుద్యోగం చేసుకునే అమ్మాయిని చస్తే చేసుకోను అన్నాడు.

దీక్షితులు లక్ష కట్నం యివ్వగల అమ్మాయి కుంటిదైనా గుడ్డిదైనా సరే చేసుకుంటానన్నాడు.

శర్మ పెద్దలు కుదిర్చిన పెళ్లే చేసుకుంటానన్నాడు.

కానీ కల్పన తన అభిప్రాయం ఛస్తే చెప్పను అంది.

ఇందుకు అందరికీ కోపం వచ్చింది. ఆదిత్యకు మరీ కోపం వచ్చింది.

అంతే కల్పనతో రెండురోజులు యెవరూ మాట్లాడలేదు. కానీ మూడోరోజు మీనాక్షి, భ్రమరాంబ రాజీ పడిపోయారు. శర్మా, దీక్షితులు, ఆనందమోహన్ కూడా మర్చిపోయి మామూలుగా మాటలు కలిపేసేరు. ఆద్యితకి యిది నచ్చలేధు.

కల్పన విజయగర్వంతో చూసింది. ఆదిత్యకి ఒళ్లంతా కారం రాచుకున్నంతగా మండింది. రోజులు భారంగా గడుస్తున్నాయి. అయినా ఆదిత్య రాజీకి రాలేదు. యెండలో అయితే పుస్తకాలసంచీ ముఖాలకి అడ్డం పెట్టుకుని వర్షం అయితే పుస్తకాల సంచులు నెత్తిన పెట్టుకుని దారిలో వున్న మామిడి తోటల్లో దూరి పసిరి పిందెలు తెంపుకుని తింటూ గడిచిపోతున్నాయి. రోజులు యిలా వుండగా వారం రోజులుగా కల్పన స్కూలుకి రాలేదు.

ఆదిత్యకి తోచటం లేదు. అందుకే అడిగాడు. "కల్పన స్కూలు మానేసిందా?" అని.

వాళ్లిద్దరూ ఏక కంఠంతో అన్నారు.

"స్కూలు మానలేదు ఆదిత్యా"

"మరెందుకు రావటం లేదు?"

ఆ ఇద్దరూ జవాబు చెప్పకుండా నవ్వసాగారు.

ఆదిత్యకి యేదో తెలియని అవమానంగా అన్పించసాగింది. అంతే! మళ్లా అడగలేదు యెవరినీ. వారం తర్వాత కల్పన తిరిగి స్కూలుకి వచ్చింది కానీ యిదివరకులా లేదు. యేదో కొత్తదనం. అదేమిటో ఆదిత్యకి తెలియటం లేదు.

ఆరోజు మీనాక్షి భ్రమరాంబలు ఎందుకో స్కూలుకురాలేదు. దీక్షితులూ, ఆనందమోహన్ శర్మా పనివుందని త్వరగా వెల్లిపోయారు. స్కూలు నించి కల్పనా, ఆదిత్యా వస్తున్నారు.

ఆకాశంలో మేఘాలు గుంపులు గుంపులుగా చేరాయి. ఏ క్షణంలోనైనా పెద్ద వర్షం వచ్చేలా వుంది.

కల్పన ఆకాశంలోకి చూసి గబగబా నడవసాగింది.

వరికంకులు కోతలకు సిద్ధమై బంగారు రంగులో మెరుస్తున్నాయి. వాటిమీద రంగు రంగుల పక్షులు వాలుతున్నాయి. సాయంకాలం అయిదు గంటలు దాటింది.

కల్పన తనని పల్కరించి మాట్లాడేలా లేదన్నది అర్థమై తనే మెల్లగా నడుస్తూ పిలిచాడు.

"కల్పనా! ఏయ్ కల్పనా ఆగు."

కల్పన ఆగలేదు. ఆద్యితకి ఆగ్రహం ముంచుకువచ్చింది.

"ఏయ్ ఆగమంటుంటే వినపడటం లేదూ?" విసురుగా వచ్చి జడ పట్టుకున్నాడు.

"ఏయ్ ముందు జడొదులు" తీవ్రంగా చూస్తూ అది.

"ఒదలను. నువ్వు వారం రోజులుగా స్కూలుకి యెందుకు రావటం లేదు? వచ్చినా నాతోయెందుకు మాట్లాడలేదు?" కోపంగా అడిగాడు.

"నాయిష్టం" అంది పెంకెగా.

"ఏయ్ నీయిష్టం వాళ్ళ దగ్గర. కానీ నాదగ్గర కాదు" మరీ కోపంగా అన్నాడు.

"ఎందుక్కాదు?" తీక్షణంగా చూస్తూ జడని లాగేసుకోపోయింది.

"నేను ఆదిత్యని కనుక" జడని వదలకుండా అన్నాడు.

"అయితే నాకేంటిట?"

"నీకు నోట్సులు యివ్వటం లేదూ? పంటకాలువలు దాటటానికి భయపడుతుంటే నే చెయ్యి ఆసరా యివ్వలేదూ, ధనుర్మాసంలో దేవాలయంలో ప్రసాదం కోసం బాదం చెట్టు ఆకులు కోసి యివ్వలేదూ? దేవాలయంలో చీకటి పడితే భయం అంటే మీ యింటివరకూ వచ్చి దించలేదూ?" అప్పుడు 'ఆదిత్యా నువ్వంటేనే నాకిష్టం' అని చెప్పలేదూ."

కల్పనకి కోపం పోయింది. ఫక్కుమంది.

"నువ్వంటే నాకిష్టం అని యిప్పుడూ అంటాను. యిక జడ వదులు."

"ఓకే" ఆదిత్య కల్పన జడ వదిలేశాడు.

"ఇప్పుడు చెప్పు. నువ్వు స్కూలుకి యెందుకి రాలేదు."

కల్పన పెదవులమీద చిరునవ్వు మెరిసింది. ముఖంలో సిగ్గు దొంతరలు చూస్తూ అర్థంకాని వాడిలా నిలబడిపోయాడు.

వర్షం చినుకులు టపటపా రాలసాగాయి.

"ఆదిత్యా పద త్వరగా పోదాం" కల్పన పరుగు తీసయసాగింది.

"ఏయ్ నాకు జవాబు చెప్పు" ఆదిత్య కల్పన వెంట పరుగెత్తసాగాడు.

"ట్యూబులైటూ నేను స్కూలు యెందుకు రాలేదో అర్థం కాలేదూ?" అంటూ పైటకొంగు అలా గాలిలో యెగరేసింది. కొంగు అలా యెగిరి ఆదిత్యముఖాన్ని ఒక్క క్షణం కప్పేసింది.

కల్పన గభాలున కొంగు లాగేసుకుని పరుగుతీసింది. కల్పన పైట గాలికి అలా యెగురుతుంటే ఆదిత్య అలా నిలబడి కళ్ళప్పగించి చూడసాగాడు. ఆ తర్వాత తండ్రి నాగులాపురం నించి మరో వూరు వెళ్ళి ప్రాక్టీసు పుట్టడంతో ఆదిత్యకి నాగులాపురం స్నేహితులకి దూరమైపోయాడు. అయినా ఇంటర్‌లో చేరిన తర్వాత ఒకసారి ఆదిత్య నాగులాపురం వెళ్ళాడు.

దీక్షితులూ, భ్రమరాంబా కలిశారు. యెన్నో కబుర్లు చెప్పుకున్నారు.

కల్పన మెడ్రాస్‌లో అన్న దగ్గర వుండి చదువుకుంటూందని చెప్పారు. అంతే! మరెప్పుడూ నాగులాపురం స్నేహితులు యెవ్వరూ కలవలేదు. కల్పన మనసులో మెదులుతూనే వుంది.

"ఆ పొట్టి జడ అమ్మాయి యిప్పుడెలా వుండి వుంటుంది. కనీసం నన్ను గురించి ఆలోచిస్తూంటుందా యెప్పుడైనా" యిలాంటి ఆలోచనలు అప్పుడప్పుడూ మనసులో కదులుతూనే వుంటాయి. యివాళ దీక్షితులు కన్పించడంతో ఆ బంగారు బాల్యం మరోసారి మనసుని మురిపించేస్తోంది.

ఆదిత్య బాల్యస్మృతులలో నించి మెల్లగా బైటపడి అలా అలా నిద్రలోకి జారిపోయాడు.

## 3

ఆదిత్యకి నిద్ర మెలకువ వచ్చేసరికి హైదరాబాదు వచ్చేసింది.

రైలుదిగిన ఆదిత్యకిఅక్క విమల స్వాగతం యిచ్చింది. కారులో యిద్దరూ ఇల్లు చేరుతుండగా అడిగాడు. "అక్కా పెళ్లిచూపులు పెళ్లిచూపులంటూ ఫోన్‌ల మీద ఫోన్‌లు చేసి నన్ను వూపిరి సలపనీయలేదు. ఇంతకీ ఆ పెళ్లి కూతురు వివరాలు చెప్పలేదు."

ఆ అమ్మాయి అందాల బొమ్మ. చదువుల సరస్వతి. అతి నెమ్మదైన అమ్మాయి. నా దృష్టిలో దాదాపు ఓ.కె."

"ఇంతకీ ఆ చదువుల సరస్వతి ఏం చేస్తోంది."

"డాక్టరుగా వుద్యోగం చేస్తోంది."

"డాక్టరా? నాకు వుద్యోగం చేసే అమ్మాయి ఒద్దూ అని చాలాసార్లు చెప్పానుగా"విసుగ్గా అన్నాడు.

"ఆ అమ్మాయి డాక్టరుగా చాలా అణకువ అయిన అమ్మాయి. నీ దుడుకుతనానికి సరిపోయే నెమ్మది వున్న పిల్ల."

"ఏమైనా నేను చూడను"

"అయ్యో నువ్వు యిలా అంటే యెలారా. వాళ్లు రేపు పెళ్లి చూపులంటూ అన్ని యేర్పాట్లూ చేసుకున్నారు."

అంటే పాతకాలంలోలా యేర్పాట్లు చేశారా! డాక్టరు చేస్తున్న ఆ అమ్మాయిని నేను ప్రశ్నలు వేయాలా! అలా వాళ్లు ఏర్పాట్లు చేస్తూంటే ఆ అమ్మాయి సరేనందా?

"అందులో తప్పేం లేదుగా"

"ఓరిదేవుడా! ఆ డాక్టరు పెళ్లికూతురు నీకెక్కడ దొరిందక్కా"

"దొరకలేదురా! నువ్వు ముదురు బ్రహ్మచారివి అయిపోతున్నావని కష్టపడి పట్టుకున్నాను. ఆ అందాల బొమ్మని"

"వూఁ ! అయితే పెళ్లిచూపులునువ్వు యేర్పాటు చేసినట్లుగా నేను చూడను. ఆ అమ్మాయి అడ్రెస్ యివ్వు. హాస్పిటల్‌కి వెళ్లి చూసివస్తాను. ఆ అందాల బొమ్మని, వరాల కుప్పని, అపర భూదేవినీ"

విమల తమ్ముడి మాటలకి ఫక్కున నవ్వింది. అంతలోనే కోపంతెచ్చుకుంది.

"నీపోలీస్ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఆ అమ్మాయికి తెలియకుండా ఆసుపత్రికి వెళ్లిచూస్తావా"

"అవును ఆ అమ్మాయి నచ్చితే నేను విమలగారి తమ్ముడిని అని చెప్తాను. లేకుంటే యింతే సంగతులు."

"చూడు అలాగే అడ్రస్ యిస్తాను. కానీ... యెందుకులే. నేసెలెక్ట్ చేసిన అమ్మాయికి యెన్ని మార్కులిస్తావో చూస్తాను"

"ఓ అలాగే! కానీ నాకు అడ్రెస్ యిచ్చి ఆ అమ్మాయికి చాటుగా ఫోన్ చేశావో వూరుకోను"

"యెన్ని కండిషన్స్ పెడుతున్నావురా"

"ఇవి కండిషన్స్ కావక్కా! ఈ నాటి యువతరం అభిప్రాయాలు. సరేగాని ఆ డాక్టరు పెళ్లికూతురు పేరేంటి"

"యిప్పుడు చెప్పను అంటూన్న అక్కని చూసి-

ఆదిత్య నవ్వేశాడు. ఇంతలో ఇల్లురానే వచ్చేసింది.

"రండి పెళ్లికొడుకుగారూ" అంటూ బావగారు కారుదిగిన ఆదిత్యకు ఆహ్వానం పలికారు.

## 4

మధ్యాహ్నం ఆదిత్య ఆర్థోపెడిక్ హాస్పిటల్‌కి వెళ్లాడు.

అయిదో అంతస్తుకి వెళ్లి డాక్టర్‌ల బోర్డులోకి చూడబోతుండగా ఓ డాక్టరు కన్పించాడు.

"డాక్టర్ మిస్ కల్పన డ్యూటీలో వున్నారా" అడిగాడు.

"ఆ నర్స్‌ని కనుక్కోండి" ఆ డాక్టరు వెళ్ళిపోయాడు.

అక్కయిచ్చిన విజిటింగ్ కార్డు యథాలాపంగా పేరు చూస్తూ వులిక్కిపడ్డాడు.

డా. కల్పన అన్నపేరుచూసి అప్పటి నుంచీ ఆదిత్య మనసులో ఆతురత పెరిగిపోసాగింది. ఈ కల్పన ఆ కల్పన కాదుకదా! ఆ ఆతురతలోనే హాస్పిటల్‌కి వచ్చేశాడు.

"ఏ కల్పన గారా! సి. కల్పనగారాండీ"

ఆదిత్య విజిటింగ్ కార్డులోకి చూసి చెప్పాడు. "ఏ కల్పన."

"ఆవిడ డ్యూటీ అయి వెళ్ళి వుండాలే"

"సి. కల్పనగారున్నారా"

"ఆ అరుగో" చేతితో చూపించింది.

లావుగా పొట్టిగా వున్న ఆవిడ తమ దగ్గరకే రావటం చూసి చప్పున అక్కడ నుంచి యివతలకు వచ్చేశాడు. తన బాల్యస్నేహితురాలు కల్పన ఇంటిపేరు గుర్తులేదు. అక్కగారి దగ్గరనుంచి వస్తూనే ఆలోచించసాగాడు. లాభం లేకపోయింది.

మరో యిద్దరు డాక్టరులని అడిగాడు.

"అరె ఇప్పుడే లిఫ్టు దగ్గరికి వెళ్ళినట్లున్నారు" అన్నారు ఇద్దరూ.

ఆదిత్య చప్పున లిఫ్టువైపుగా నడిచాడు. లిఫ్టు పైనుంచి క్రిందికి రావటం అప్పటికే అక్కడున్న ఓ అందమైన అమ్మాయి కాశ్మీరు సిల్కు చీర, మాచింగ్ జాకెట్ చెవులకి ఒంటి ముత్యం దుద్దులూ, మెడలో సన్నటి గొలుసూ భుజాన కోటుతో లిఫ్ట్‌లోకి వెళ్ళటం చూసి తనూ లిఫ్ట్‌లోకి నడిచాడు. అప్పటికే అక్కడ చాలామంది వున్నారు. ఆ డాక్టర్‌ని పరీక్షగా చూసే అవకాశం లేదు.

ఎవరో ఆ అమ్మాయితో మాట్లాడుతున్నారు.

లిఫ్ట్ గ్రవుండ్ ఫ్లోరుకి రావటం ఆ డాక్టరు చక చకా నడుస్తూ వెళ్ళటం చూసిన ఆదిత్యలో అనుమానం కలుగసాగింది.

"కల్పనా!" అన్నాడు రెండడుగులు ముందుకువేసి.

డాక్టరు ఒకే ఒక క్షణం తొట్రుపడినట్లు అయి అంతలోనే ముందుకు వెళ్ళికారెక్కేయటం ఆదిత్య దృష్టిని దాటిపోలేదు.

'ఆ కల్పనే అయితే తన పిలుపువిని తప్పకుండా ఆగి వెనక్కి తిరిగిచూసేది. కానీ ఈ కల్పన చూడలేదంటే తన ఫ్రెండ్ మాత్రం కాదు. అయినా ఈ అమ్మాయే కల్పన అని నేను పొరపాటు పడ్డానేమో' ఆలోచనలు తినేస్తుంటే ఇల్లు చేరాడు ఆ...

అక్క అన్నం వడ్డిస్తూ చెప్పింది.

"కల్పన ఈ రోజు హాస్పిటల్‌కే వెళ్లలేదుట. ఆ విషయం నాకు తెలియలేదురా తమ్ముడూ అయినా రేపు చూస్తావుగా"

"చూడను. నేనీరోజునే వెళ్లిపోతున్నాను గోదావరికి."

"అరేయ్ అదేం పనిరా" అక్క నోరుకొట్టుకుంది.

"అది అంతే"

అదిత్య అన్నట్టుగానే సాయంకాలం ప్రయాణమైనాడు. బావగారు చెప్పినా వినకుండా రైల్వే స్టేషనుకి వెళ్లిపోయాడు. విమలా, విమల భర్తా స్టేషనుకి వచ్చారు.

"ఇదిగో ఆదిత్యా నువ్వు పెళ్లి చూపుల కంటూ వచ్చి తనని చూడకుండా వెళ్లిపోతున్నావని తెల్సి తనే వచ్చేస్తోంది. నిన్ను చూడటానికి ఇంటర్వ్యూ చేయటానికీ' బావగారు అన్నారు.

"అక్కా నువ్వు చెప్పిన డాక్టరు పెళ్లి కూతురేనా" అన్నాడు. చిన్నగొంతుతో.

"అవును నామాటంటే ఆఅమ్మాయికి చాలా విలువ కనుక వస్తోంది."

"వూ! అయినా నేను వూరు వెళ్లుతుంటే యిక్కడేమిటి గోల" పెదవులు బిగపట్టి అన్నాడు.

"నువ్వు నేర్పిన విద్యయే నీరజాక్ష" అంటూ నవ్వింది విమల.

"అదుగో కల్పన వస్తోంది.' అని బావగారు అనగానే చప్పున తలతిప్పి చూశాడు.

ఇద్దరమ్మాయిలు ఒకే వయసువారు ఒకే లావున్నట్టున్నారు. దూరం నుంచి చూస్తే. కానీ దగ్గరకి వచ్చిన తర్వాత తెల్సింది భేదం. అందులో ఓ అమ్మాయి వుదయం చూసిన డాక్టరుకల్పన.

"ఇంత ఆలశ్యంగా వచ్చావేం కల్పనా" విమల మందలిస్తూన్నట్లే అంది.

"ఆదిత్య యీ అమ్మాయేనోయ్ కల్పన. పరిచయం చేశాడు. బావగారు. ఒకరినొకరు నమస్కారం చేసుకున్నారు.

ఇంతలో రైలు కదిలింది. ఆదిత్య రైలు యెక్కేశాడు.

ఆదిత్య కల్పన ముఖంలోకి పరిశీలనగా చూశాడు.

కల్పనా అలాగే చూస్తోంది. ఆమె కళ్ళు చిలిపిగా నవ్వినట్లు అన్పిస్తున్నాయి.

'గుర్తించలేదు కదూ! అన్న భావం, పసికట్టాడు. కల్పన కావాలనే యిలా ప్లాన్ చేసింది. ఆ ప్లాన్‌ని తను విజయవంతంగా తిప్పి కొట్టినట్లు యిప్పటికి అర్థమై 'నేను నీ చిన్న నాటి ఫ్రెండ్‌నే' అని తెలియజెప్పటానికి ప్రయత్నించే కల్పనని చప్పున జడపట్టుకోబోయి ఆగాడు.

ఇదే నాగులాపురంలోని ఆ రోజుల్లో అయితే యెంతబావుండేది.

'ఓ బంగారు బాల్యమా! ఒక్కసారి తిరిగిరా?' అనుకున్నాడు వుత్సాహం పురకలు వేస్తుండగా.

'అమ్మ దొంగా! నన్నే ఓడించావే' కొంటెగా నవ్వబోయి ఆనవ్వుని ఆపేసుకుంది కల్పన.

రైలు వేగాన్ని అందుకుంటూంది. కల్పన రైలు వెంట రెండడుగులు వేసిచెయ్యి వూపసాగింది.

ఆదిత్యకి రైలులోంచి కిందకి దూకేయాలనీ, కల్పన చెవులు మెలేసి గుంజీలు తీయించాలనీ యింకా చాలా చాలా అన్పించసాగింది. అవతల బావగారూ అక్కా వున్నారు. 'అయినా అనుకున్నవన్నీ చేయటానికిది బాల్యమా!' మనసు ప్రశ్నిస్తోంది.

"త్వరలోనే హైదరాబాద్ పెళ్లికొడుకుగా రావాలి నువ్వు" బావగారు గట్టిగానే అంటున్నారు దూరం నుంచి.

ఆదిత్య కళ్లకి లంగా ఓణీలో పరుగెత్తుతున్న ఆ చిన్ననాటి కల్పనే కదులుతోంది. మనసు పులకరిస్తోంది.

రైలు వేగంగా ముందుకి పరుగుతీస్తోంది.

రచన సచిత్ర మాస పత్రిక